RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:90 | మార్చి 19, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

వేద న్యూస్ తెలుగు దిన పత్రిక పాఠకులకు, ప్రకటన కర్తలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు



లింగబత్తిని కృష్ణ
సీఎండీ & చీఫ్ ఎడిటర్
వేద న్యూస్ తెలుగు దినపత్రిక
9701923260

## తెలంగాణ, ఏపీల్లోని హోంగార్డుల కన్నీటి గాథ

### రాష్ట్ర విభజన జరిగినా ఎక్కడివారు అక్కడే

- అన్నిశాఖల్లో బదిలీలు.. వీరిపై మాత్రం వివక్ష
- కుటుంబాలకు దూరం.. ఆర్థిక, మానసిక కుంగుబాటు
- పిల్లల భవిష్యత్తు, స్థానికతపైనా ప్రభావం
- ఎంత మంది ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం శూన్యం
- దయనీయంగా 400మంది హోంగార్డుల పరిస్థితి
- సొంత రాష్ట్రాలకు ఇప్పటికైనా బదిలీ చేయాలని వేడుకోలు
- ఇరు రాష్ట్రాల సీఎంలకు హోంగార్డుల కన్నీటి విన్నపం
- చట్టం కంటే మానవత్వం గొప్పదని చాటి చెప్పాలంటున్న బాధిత కుటుంబాలు



రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా, కొందరు అల్పాదాయ ఉద్యోగుల జీవితాల్లో మాత్రం విభజన రేఖలు ఇంకా చెరిగిపోలేదు. గన్ పట్టుకుని శాంతిభద్రతలను కాపాడే హోంగార్డులు, ఇప్పుడు తమ సొంత గూటికి చేరుకోవడానికి కన్నీటి పోరాటం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానికత ఉండి తెలంగాణలో, తెలంగాణ మూలాలు ఉండి ఆంధ్రప్రదేశ్‌లో చిక్కుకుపోయిన సుమారు 400 మంది హోంగార్డుల పరిస్థితి అటు ఇటు కాకుండా తయారైంది. అన్ని శాఖల ఉద్యోగులకు ఆప్షన్ల ద్వారా బదిలీలు కల్పించిన ప్రభుత్వాలు, కేవలం ఈ కొద్దిపాటి సంఖ్యలో ఉన్న హోంగార్డుల విషయంలో చూపుతున్న నిర్లక్ష్యం వందలాది కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. ఒకవైపు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకోలేక, మరోవైపు పిల్లల చదువులు సాగుతున్న క్రమంలో తమ అసలైన స్థానికతను ఎక్కడ కోల్పోతామో అన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. తక్కువ వేతనాలతో అంతర్రాష్ట్ర దూరాలను భరిస్తూ, మానసిక కుంగుబాటుకు లోనవుతున్న ఈ హోంగార్డుల గోడును వినేవారే కరువయ్యారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఈ సమస్యను పరిష్కరించి, తమను సొంత రాష్ట్రాలకు పంపాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను వేడుకుంటున్నారు. చట్టం కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పాల్సిన తరుణంలో, ప్రభుత్వాలు ఈ సున్నితమైన అంశంపై ఎప్పుడు స్పందిస్తాయో చూడాలి.

2లో

వేద న్యూస్, (ఎల్. కే) ప్రత్యేక ప్రతినిధి

# డ్యూటీలు ఇక్కడ..
# ఫ్యామిలీస్ అక్కడ..!

## రూ.20 లక్షల నగదు, భారీగా బంగారం



**ఎక్సైజ్ సీఐ ఇంట్లో ఏసీబీ సోదాలు**

- ఉపాధ్యాయుడితో కలిసి అక్రమ లావాదేవీలు వెలుగులోకి..
- బెల్లం వ్యాపారి నుంచి పెద్ద మొత్తంలో మామూళ్ల వసూలు
- అవినీతి కేసులో అరెస్ట్

2లో

## తండ్రి, కూతురు సజీవ దహనం


- పూర్తిగా కాలిపోయాయిన మృతదేహాలు
- పెట్రోల్ పోసి నిప్పంటించినట్టు అనుమానం
- కడిపికొండలో విషాదం..



2లో

## అక్రమ వలసదారులకు ట్రంప్ భారీ ఆఫర్

**స్వచ్ఛందంగా అమెరికా విడిచి వెళ్తే రూ. 2.40 లక్షల బోనస్!**



2లో

## నెల రోజులుగా తాగునీటి కటకట

**మంచినీళ్లివ్వండి మహాప్రభో..!**

- దాహార్తి తీర్చాలంటూ ప్రజల వినతి
- సమస్య పట్ల స్పందించని అధికారులు
- కాజీపేట మండలంలో తీవ్రంగా తాగునీటి సమస్య

2లో



## ఎస్ఐ భార్య ఆత్మహత్య



- దంపతుల మధ్య ఘర్షణ.. కుటుంబ కలహాలే కారణం
- కరీంనగర్ పోలీస్ శాఖలో కలకలం

2లో

వేద న్యూస్

గురువారం | మార్చి 19, 2026

# తండ్రి, కూతురు సజీవ దహనం

- పూర్తిగా కాలిపోయాయిన మృతదేహాలు
- పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు అనుమానం
- కడిపికొండలో విషాదం..



**వేద న్యూస్, కడిపికొండ**

కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బుధవారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. బ్లాక్ నంబర్ 10లో నివాసముంటున్న తండ్రి, కూతురు అనుమానాస్పద పరిస్థితుల్లో మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మృతులను రాజశేఖర్ (54), ఆయన కుమార్తె రాజశ్రీ (24)గా పోలీసులు గుర్తించారు. తెల్లవారుజామున ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే మడికొండ సీఐ పుల్యాల కిషన్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురాగా, అప్పటికే మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామ, భార్యను హత్య చేసి దానిని అగ్నిప్రమాదంగా చిత్రీకరించేందుకు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఎస్ఐ భార్య ఆత్మహత్య

- దంపతుల మధ్య ఘర్షణ.. కుటుంబ కలహాలే కారణం
- కరీంనగర్ పోలీస్ శాఖలో కలకలం



**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ పరిధిలో టూ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, ఆత్మహత్యకు ముందు దంపతుల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దివ్య గన్నేరు పప్పుతో పాటు విషపదార్థం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు చంద్రశేఖర్ కారణమనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మృతురాలు దివ్య స్వస్థలం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వెలుగుమట్ల భూదాన్ భూములపై హైకోర్టు స్టేటస్ కో

### యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశాలు

**వేద న్యూస్, ఖమ్మం**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన్ భూముల వ్యవహారంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భూదాన్ భూములపై ప్రస్తుతం ఉన్న పరిస్థితిని అలాగే కొనసాగించాలని కోర్టు స్టేటస్ కో విధించింది. భూదాన్ భూముల విషయంలో అసలైన లబ్ధిదారులను గుర్తించాలని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. నష్టపోయిన బాధితులందరికీ భూదాన్ భూముల్లో ఇళ్ల స్థలం మరియు గృహం మంజూరు చేయాలని వారు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును పరిశీలించిన హైకోర్టు 311 మంది మాత్రమే కాకుండా, అక్కడ ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే భూదాన్ భూములపై స్టేటస్ కో కొనసాగించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాహసీల్దార్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు యథాస్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది.

# డ్యూటీలు ఇక్కడ.. ఫ్యామిలీస్ అక్కడ..!

**వేద న్యూస్, (ఎల్. కే) ప్రత్యేక ప్రతినిధి**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా, ఇంకా కొన్ని విభజన గాయాలు పచ్చిగానే ఉన్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల విభజన వారి స్థానికత ఆధారంగా జరిగిపోయినప్పటికీ, రక్షణ శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న హోంగార్డుల విషయంలో మాత్రం అన్యాయం జరుగుతూనే ఉంది. డ్యూటీ ఒక రాష్ట్రంలో.. కుటుంబం మరో రాష్ట్రంలో అన్నట్లుగా సాగుతున్న వీరి జీవితాలు ఇప్పుడు కన్నీటి గాథలుగా మారాయి. తమను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, డీజీపీలను వేడుకుంటున్నారు.

**విభజన తెచ్చిన విడబాటు..**

2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగిన సమయంలో, ఉమ్మడి రాష్ట్రంలో ఎంపికైన హోంగార్డులు ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన సుమారు 200 మంది హోంగార్డులు తెలంగాణలోనూ, అలాగే తెలంగాణకు చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ఆంధ్రప్రదేశ్‌లోనూ పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఆప్షన్ల ద్వారా బదిలీలు జరిగినప్పటికీ, హోంగార్డుల విషయంలో అటువంటి వెసులుబాటు కల్పించకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. కేవలం 400 మందికి సంబంధించిన ఈ చిన్న సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు చూపుతున్న నిర్లక్ష్యం వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.

**కుటుంబాలకు దూరం.. ఆర్థిక, మానసిక కుంగుబాటు**

తక్కువ వేతనాలతో శాశ్వత సేవలు అందిస్తున్న హోంగార్డులకు ఈ అంతర్రాష్ట్ర డ్యూటీలు పెనుభారంగా మారాయి. కుటుంబాలు సొంత రాష్ట్రాల్లో ఉండటం వల్ల నెలకు ఒకసారి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకోలేక, భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. మరోవైపు, వేరే రాష్ట్రంలో ఉంటూ డ్యూటీ చేయాల్సి రావడంతో రవాణా ఖర్చులు పెరిగి ఆర్థికంగా చితికిపోతున్నారు. 'మా కష్టం పగవారికి కూడా రాకూడదు' అంటూ వారు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.

**పిల్లల చదువులు.. భవిష్యత్తుపై ఆందోళన**

ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రా హోంగార్డుల పిల్లలు ఇక్కడే చదువుకుంటున్నారు. ఒకవేళ వీరు ఇక్కడే పదవీ విరమణ పొందితే, భవిష్యత్తులో వారి పిల్లలు తమ సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో స్థానికతను కోల్పోయే ప్రమాదం ఉంది. అటు ఇటు కాకుండా పోతున్న పిల్లల భవిష్యత్తును తలచుకుని హోంగార్డులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఈ బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని, తద్వారా తమ పిల్లలను సొంత రాష్ట్రంలోని పాఠశాలల్లో చేర్చుకునే అవకాశం ఉంటుందని వారు కోరుతున్నారు.

**ప్రజాప్రతినిధుల మౌనం..**

తమ సమస్యను పరిష్కరించాలని హోంగార్డుల సంఘం ఇప్పటికే పలువురు మంత్రులను, అధికారులను కలిసినా ఫలితం శూన్యంగా మారింది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ప్రజా సంఘాలు, మేధావులు మండిపడుతున్నారు. అంతర్రాష్ట్ర బదిలీలు అన్నవి ప్రభుత్వాల మధ్య చిన్న అవగాహనతో ముగిసిపోయే అంశమని, కేవలం 400 కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశాన్ని ఇంత కాలం పెండింగ్‌లో పెట్టడం సరైనది కాదని అభిప్రాయపడుతున్నారు. అల్పాదాయ వర్గాల పట్ల ప్రభుత్వాలు మానవీయ కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు కూడా సూచిస్తున్నారు.

**తక్షణమే స్పందించాలి..**

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ విషయంలో చొరవ చూపి, పరస్పర అంగీకారంతో హోంగార్డులను వారి సొంత రాష్ట్రాలకు పంపాలని బాధితులు కోరుతున్నారు. ఎంతో మంది ప్రజాప్రతినిధులను కలిసినా ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో, ఇప్పుడు మీడియా ద్వారా తమ ఆవేదనను ఇరు రాష్ట్రాల గవర్నమెంట్లకు విన్నవిస్తున్నారు. స్కూళ్లు తెరిచే లోపే తమకు న్యాయం జరుగుతుందని, పదేళ్ల నిరీక్షణకు తెరపడుతుందని హోగార్డులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### తెలంగాణ, ఏపీల్లోని హోంగార్డుల కన్నీటి గాథ

**రాష్ట్ర విభజన జరిగినా ఎక్కడివారు అక్కడే**

- అన్నిశాఖల్లో బదిలీలు.. వీరిపై మాత్రం వివక్ష
- కుటుంబాలకు దూరం.. ఆర్థిక, మానసిక కుంగుబాటు
- పిల్లల భవిష్యత్తు, స్థానికతపైనా ప్రభావం
- ఎంత మంది ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం శూన్యం
- దయనీయంగా 400మంది హోంగార్డుల పరిస్థితి
- సొంత రాష్ట్రాలకు ఇప్పటికైనా బదిలీ చేయాలని వేడుకోలు
- ఇరు రాష్ట్రాల సీఎంలకు హోంగార్డుల కన్నీటి విన్నపం
- చట్టం కంటే మానవత్వం గొప్పదని చాటి చెప్పాలంటున్న బాధిత కుటుంబాలు

# నెల రోజులుగా తాగు నీటి కటకట

**వేద న్యూస్, కాజీపేట**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గత నెల రోజులుగా మడికొండ, రాంపూర్ గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సరైన నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉండటంతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దిగజారుతుందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను వివరించినా సరైన సమాధానం ఇవ్వడం లేదని, వాటర్ ట్యాంకుల వద్ద మోటార్లు పాడైపోయాయని స్థానిక లైన్‌మెన్ చెబుతున్నారని తెలిపారు. ఎక్కడ సమస్య ఉందో కూడా అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని విమర్శించారు. నీటి కొరతతో ప్రజలు మినరల్ వాటర్ కొనుగోలు చేసి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**నీటి సమస్య తీవ్రంగా ఉంది..**



మడికొండకు చెందిన దాస్యం వికాస్ మాట్లాడుతూ.. తమ కాలనీలో గత కొన్ని రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు పలుమార్లు చెప్పినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుని తాగునీరు అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**మంచినీళ్లివ్వండి మహాప్రభో..!**


- దాహార్తి తీర్చాలంటూ ప్రజల వినతి
- సమస్య పట్ల స్పందించని అధికారులు
- కాజీపేట మండలంలో తీవ్రంగా తాగునీటి సమస్య



# అక్రమ వలసదారులకు ట్రంప్ భారీ ఆఫర్

### స్వచ్ఛందంగా అమెరికా విడిచి వెళ్తే రూ. 2.40 లక్షల బోనస్!

**వేద న్యూస్, డెస్క్**



అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను సాగనంపేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఒక సంచలన వ్యూహాన్ని అమలులోకి తెచ్చింది. బలవంతపు బహిష్కరణల కంటే, వలసదారులు తమంతట తాముగా దేశం విడిచి వెళ్లేలా ప్రోత్సహించేందుకు భారీ ఎగ్జిట్ బోనస్ ను ప్రకటించింది. ఈ పథకం కింద స్వచ్ఛందంగా వెనుదిరిగే వారికి 2,600 డాలర్లు (సుమారు రూ. 2.40 లక్షలు) నగదు ప్రోత్సాహకంతో పాటు, వారి స్వదేశాలకు వెళ్లే విమాన ప్రయాణ ఖర్చులను కూడా అమెరికా ప్రభుత్వమే భరించనుంది. ట్రంప్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా గతంలో ఉన్న వెయ్యి డాలర్ల బోనస్‌ను ఇప్పుడు 2,600 డాలర్లకు పెంచడం గమనార్హం. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు సీబీపీ హోమ్ అనే ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా నమోదు చేసుకున్న వారిని బలవంతపు బహిష్కరణ జాబితా నుండి తొలగిస్తారు. ఒక వలసదారుడిని అరెస్ట్ చేసి పంపడానికి ప్రభుత్వానికి సుమారు 18,245 డాలర్లు ఖర్చవుతుండగా, ఈ స్వచ్ఛంద పథకం ద్వారా కేవలం 5,100 డాలర్లతోనే పని పూర్తవుతుందని, దీనివల్ల పన్ను చెల్లింపుదారుల సొమ్ము భారీగా ఆదా అవుతుందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. అయితే, ఈ అవకాశాన్ని వదులుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అరెస్ట్ చేసి పంపితే మళ్లీ అమెరికాలో అడుగుపెట్టే అవకాశం ఉండదని సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోమ్ హెచ్చరించారు. ఇప్పటివరకు ఈ విధానం ద్వారా సుమారు 22 లక్షల మంది అమెరికాను వీడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి


# రూ.20 లక్షల నగదు.. భారీగా బంగారం

### ఎక్సైజ్ సీఐ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఉపాధ్యాయుడితో కలిసి అక్రమ లావాదేవీలు వెలుగులోకి..
- బెల్లం వ్యాపారి నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు వసూలు
- అవినీతి కేసులో అరెస్ట్

**వేద న్యూస్, జగిత్యాల**

జగిత్యాల జిల్లాలో అర్ధరాత్రి ఏసీబీ సోదాలు సంచలనం సృష్టించాయి. అవినీతి కేసులో కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ గుండెటి రామును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సోదాల సందర్భంగా భారీ మొత్తంలో నగదు, బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన రాముతో పాటు అతడికి సహకరించిన జగిత్యాల జిల్లా ఉపాధ్యాయుడు జక్కని వేణును కూడా అదుపులోకి తీసుకున్నారు. రాము వేములవాడ ఎస్‌హెచ్ఓగా పనిచేసిన సమయంలో ఒక బెల్లం వ్యాపారి నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ సొమ్మును నేరుగా తీసుకోకుండా ఉపాధ్యాయుడు వేణు బ్యాంకు ఖాతాల ద్వారా కుటుంబ సభ్యులకు మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. రాము నివాసంలో జరిపిన సోదాల్లో సుమారు రూ.20 లక్షల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.



వేద న్యూస్

గురువారం మార్చి 19, 2026

# గట్టుబుత్కూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, గంగాధర**

గంగాధర మండలం గట్టుబుత్కూర్ గ్రామంలో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి-రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామస్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, గుండె సంబంధిత పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నారు. అవసరమైన వారికి వైద్య సలహాలు కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు.

# పోగొట్టుకున్న మొబైల్‌ను అప్పగింత

**వేద న్యూస్, శంకరపట్నం :**



శంకరపట్నం మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఈరబోయిన గంగమ్మ తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. దీనిపై ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి మొబైల్‌ను గుర్తించి బాధితురాలికి తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా మండల ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే మిస్సింగ్ మొబైల్స్ సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. దీంతో పోయిన మొబైల్‌ను గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

# నవోదయ పరీక్షలో శ్రీప్రగతి విద్యార్థినికి అర్హత

**వేద న్యూస్, రామడుగు:**



గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో రామడుగు మండలం గోపాలరావుపేటలోని శ్రీ ప్రగతి హైస్కూల్‌కు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని సముద్రాల నిత్య శర్మ ఆరవ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ విద్యార్థినిని అభినందించారు. నిత్య శర్మ ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, ముఖ్యంగా మాస్టర్ రాజశేఖర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని సాధించిన ఈ విజయంతో పాఠశాల ప్రతిష్ట మరింత పెరిగిందని ఆయన తెలిపారు.

# కోదురుపాకలో ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరం గురించి గ్రామ సర్పంచ్ కత్తేరపాక మంజులసుధాకర్ తెలిపారు. గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, గుండె సంబంధిత పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు వైద్య సలహాలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# ఆరు గ్యారెంటీల అమలు కోసం బీజేపీ వినతి

- కాంగ్రెస్ హామీలు అమలు చేయించే వరకు పోరాటం
- వనపర్తి పట్టణ అధ్యక్షుడు పెద్దిరాజు

**వేద న్యూస్, వనపర్తి:**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ వనపర్తి పట్టణ బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, కానీ 27 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. యువత, మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలను మోసం చేశారని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, వ్యవసాయ డిక్లరేషన్ పేర్లతో ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి, అమలు చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు అయ్యే వరకు బీజేపీ ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజుతో పాటు పట్టణ అధ్యక్షుడు ఏ. రాజశేఖర్ గౌడ్, మాజీ ఉపాధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ ఎం. విజయసాగర్, సీనియర్ నాయకులు ఆగపోగు కుమార్, దాసరాజు ప్రవీణ్, కొమ్ము శ్రీనివాసులు, కంచ రవి, కే. గోపీనాథ్, సూర్యవంశం శీను, రాయన్న సాగర్, చాణిక్య, ఉపేందర్ యాదవ్, చిన్న రాయుడు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి తెలుగు పర్వం.. ఉగాది

- అనాదిగా వస్తున్న ఆచారం

**వేద న్యూస్, చొప్పదండి**



తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పర్వదినాన్ని యావత్ భారతదేశంలోని తెలుగు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. తెలుగు క్యాలెండర్‌లో తొలి పండుగగా ఉగాది ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఉగాది నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమై, శ్రీరామ నవమితో ముగుస్తాయి. ఉగాది రోజున వేపపువ్వు కలిపిన ఉగాది పచ్చడి సేవించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం వెనుక ఆరోగ్యపరమైన సందేశం దాగి ఉంది. వేపపూత, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు, ఉప్పు కలిపిన షడ్రుచుల మిశ్రమాన్నే ఉగాది పచ్చడి అంటారు. వేప, బెల్లం వంటి పదార్థాలు శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయని పెద్దలు చెబుతారు. వేసవి కాలం ప్రారంభానికి ముందు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని శరీరంలో ఉష్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశముంది. ఈ సమస్యలను తగ్గించేందుకు వేప-బెల్లం వంటి పదార్థాలను తీసుకోవడం ఒక ఆరోగ్యకరమైన పద్ధతిగా భావిస్తారు. ఈ పచ్చడి సేవించడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడటంతో పాటు కంటిచూపుకూ మేలు కలుగుతుందని విశ్వాసం. షడ్రసాలతో కూడిన ఈ పచ్చడిని మనుషుల జీవితంలోని సుఖసంతోషాలకు ప్రతీకగా భావించడం విశేషం. జీవితం అనేది కష్టసుఖాల సమ్మేళనం అనే సందేశాన్ని ఈ ఆచారం ద్వారా పెద్దలు తెలియజేశారు. ఉగాది రోజున సాయంత్రం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించడం కూడా సంప్రదాయం. పంచాంగ శ్రవణం వినడం ద్వారా సర్వపాపాలు తొలగి శుభాలు కలుగుతాయని ప్రజల విశ్వాసం.

# చొప్పదండిలో టిఫిన్ ధరల పెరుగుదలపై ఆగ్రహం

- రేట్లు తగ్గించాలంటూ సోషల్ మీడియాలో వినియోగదారుల డిమాండ్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలోని టిఫిన్ సెంటర్లలో పెరుగుతున్న ధరలు వినియోగదారులను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఇడ్లీ, దోస, పూరీ వంటి సాధారణ టిఫిన్ పదార్థాల ధరలు ఇటీవల గణనీయంగా పెరగడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్ రేట్లు తగ్గించాలి అంటూ సోషల్ మీడియా వేదికగా పట్టణంలోని పలు గ్రూపుల్లో వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం టిఫిన్ ధరలు రూ.40 నుంచి రూ.60 వరకు పెరిగినట్లు సమాచారం. కొన్ని చోట్ల రూ.5 నుంచి రూ.10 వరకు చిన్నచిన్న పెంపులు కూడా చోటుచేసుకున్నాయి. దీంతో రోజువారీగా బయట టిఫిన్ తీసుకునే ప్రజలపై అదనపు భారంగా మారింది. వినియోగదారులు మాట్లాడుతూ, ధరల పెరుగుదల కారణంగా సాధారణ ఆహారం కూడా అందుబాటులో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హోటల్ యజమానులు వంట గ్యాస్ (ఎల్పీజీ) ధరల పెరుగుదల, సరఫరా లోపాలు, ఇతర వ్యయాలు అధికమవడం వల్లే ధరలు పెంచాల్సి వచ్చిందని చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. గ్యాస్ కొరత కారణంగా కొన్ని టిఫిన్ సెంటర్లు మూతపడినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో వినియోగదారులు, వ్యాపారులు ఇద్దరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరలు పెరిగితే వినియోగదారులకు భారంగా మారుతుండగా, తగ్గిస్తే వ్యాపారులకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టిఫిన్ ధరలను తగ్గించి, నాణ్యతను కాపాడుతూ సరసమైన ధరల్లో అందించాలని, సమస్యపై అధికారులు జోక్యం చేసుకుని పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన కక్కెర్ల రాజు తండ్రి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లబెల్లి బ్రాంచ్‌లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించారు. ఈ పథకం కింద సాంబయ్య కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును నామినీలు కక్కెర్ల శంకర్, దేవికి అందజేశారు. వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీరామ్, నల్లబెల్లి బ్రాంచ్ మేనేజర్ తేజావత్ నగేష్, సబ్ మేనేజర్ తేజావత్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా చెక్కు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీరామ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తక్కువ ప్రీమియంతో ఇలాంటి బీమా పథకాల్లో చేరి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ నవీన్ రెడ్డి, రామకృష్ణ, బ్యాంకు మిత్ర అడ్డగట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన అఖిలపక్ష పోరాట సమితి

- గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా వినతి
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొడతామని హెచ్చరిక



**వేద న్యూస్, ఏదుల మండలం:**

ఏదుల మండల కేంద్రంలో జరుగుతున్న గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక ధర్నా నేపథ్యంలో అఖిలపక్ష పోరాట సమితి సభ్యులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. టీం దండే విజయుడు (వనపర్తి జిల్లా కన్వీనర్) పిలుపు మేరకు పోరాట సమితి సభ్యులు దొడ్ల రాములు, మద్దం రమేష్, అబ్దుల్ మహమూద్, బంకల సునీల్ కుమార్ హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్సీ మల్లన్నను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ గొల్లపల్లిచీర్కపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శాసన మండలి సమావేశాలు జరుగుతున్న కారణంగా వెంటనే రావడం సాధ్యం కాకపోయినా, త్వరలోనే ధర్నా స్థలానికి వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర స్థాయి నాయకులతో కలిసి ధర్నా చౌక్ వద్దకు వచ్చి ప్రజలకు ప్రాజెక్టుపై పూర్తి వివరాలు తెలియజేస్తానని తెలిపారు. ఇదే సందర్భంగా పోరాట సమితి సభ్యులు ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను కూడా కలిసి మద్దతు కోరగా, వారు కూడా ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఆరు గ్రామాల రైతులు, ప్రజలు ధైర్యంగా ఉండాలని అఖిలపక్ష నాయకులు భరోసా ఇచ్చారు. అవసరమైతే కేంద్రమంత్రులను కూడా కలిసి సమస్యను తెలియజేస్తామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఏ విధంగానూ సహించబోమని నాయకులు హెచ్చరించారు.

# ఆటోల్లో లౌడ్‌స్పీకర్లు నిషేధం

- అతిక్రమిస్తే కఠిన చర్యలు - ట్రాఫిక్ సీఐ వెంకన్న

**వేద న్యూస్, కాజీపేట:**



ఆటోల్లో లౌడ్‌స్పీకర్లు, డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయడం నిషేధమని కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం శాయంపేట జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లౌడ్‌స్పీకర్లు, డీజే సిస్టమ్‌లు అమర్చిన ఆటోలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని తొలగించినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సరైన పత్రాలు లేకుండా ఆటోలు నడపరాదని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని, నియమాలను కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకన్న సూచించారు.

వేద న్యూస్
గురువారం మార్చి 19, 2026

# పనిచేయని అధికారులు సెలవు పెట్టి వెళ్లండి

- తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి
- మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం



**వేద న్యూస్, వనపర్తి:**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వనపర్తి పట్టణంలో తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా వ్యవస్థపై పలు అంశాలను అధికారులతో చర్చించారు. రామన్‌పాడు, ఎర్రగట్టు, కానాయపల్లి, గుంపుగట్టు ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్న నీటి వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. పలుచోట్ల అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న సమస్యలు పరిష్కారం కాక తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనిచేయని అధికారులు సెలవు పెట్టి వెళ్లాలని, నిబద్ధతతో పనిచేయాలనుకునేవారు మాత్రమే విధుల్లో కొనసాగాలని కఠినంగా హెచ్చరించారు. పాత పద్ధతులు మానుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మిషన్ భగీరథ, రామన్‌పాడు తాగునీటి సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు నియమించిన 74 మంది సిబ్బంది ఇతర పనుల్లో ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే, వారిని వెంటనే తాగునీటి పనులకు నియమించాలని సూచించారు. వాటర్ లైన్మెన్లతో మాట్లాడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పట్టణంలోని కాలనీలలో నల్లాలకు నియంత్రణ వ్యవస్థ లేకపోవడంతో నీరు వృథా అవుతోందని లైన్మెన్లు పేర్కొనగా, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సుమారు 200 బోర్లలో కొన్ని మోటర్లు లేక నిరుపయోగంగా ఉన్నాయని గుర్తించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. బుగ్గపల్లి తండా, గుంపుగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో అవసరమైనంత మానవ వనరులు పెంచి, సమస్యలు తలెత్తగానే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆత్మహత్య

- నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం



**వేద న్యూస్, నాగర్‌కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. జిల్లా సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వనపట్లలోని తన స్టోన్ క్రషింగ్ మిషన్ కార్యాలయంలో ఉరి వేసుకుని ఆయన ప్రాణాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం, శ్రీనివాసరెడ్డి గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మనస్థాపానికి గురై కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. శ్రీనివాసరెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, అనుచరులు తీవ్ర దిగ్బ్రాంధానికి లోనయ్యారు.

# అకాల వడగండ్ల వర్షానికి నేలరాలిన వరి గింజలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన అకాల వడగండ్ల వర్షానికి రుద్రూర్ మండల కేంద్రంలోని లింగంపల్లి శివారుతో పాటు చిక్కడపల్లి, అంబం(ఆర్), అక్బర్ నగర్ తదితర గ్రామాలల్లోని వరి పంటలు నేలకొరిగి వరి గింజలు నేలరాలాయి. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామన్నారు. అకాల వర్షానికి పంటలు నష్టపోయమని రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

# కంపెనీల లాభాల వేటలో 'బాల్యం' బలి!

- ఓం శివశక్తి ఐరన్ ఇండస్ట్రీస్ నిర్లక్ష్యం
- 13 ఏళ్ల బాలుడి మృతి సంచలనం
- బాల కార్మిక చట్టాలపై అధికారుల మౌనం
- రెండు ఆధార్ కార్డులు.. వయస్సు మార్పుపై అనుమానాలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



**వేద న్యూస్, రంగారెడ్డి:**

రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామపంచాయతీ పరిధిలోని ఓం శివశక్తి ఐరన్ ఇండస్ట్రీస్‌లో 13 ఏళ్ల బాలుడు సౌరబ్ కుమార్ మృతి తీవ్ర సంచలనం రేపుతోంది. కంపెనీల నిర్లక్ష్యం, బాల కార్మిక వ్యవస్థపై ఉన్న అనుమానాలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయి. బీహార్‌కు చెందిన రంజిత్ కుమారుడు సౌరబ్ (13)ను చట్టవిరుద్ధంగా కాంట్రాక్ట్ ఆధారంగా పనిలో పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పది రోజుల క్రితం లారీపై నుంచి పడి తలకు తీవ్ర గాయమైనా, యాజమాన్యం అతడిని ఆసుపత్రికి తరలించకుండా స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించి మళ్లీ పనిలోకి పంపినట్లు సమాచారం. గాయాలతోనే పని చేయిస్తూ చివరకు అస్వస్థతకు గురైన బాలుడు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. సేఫ్టీ పరికరాలు లేకపోవడం, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ఘటనకు కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెల్మెట్ వంటి రక్షణ సామగ్రి ఉంటే బాలుడు ప్రాణాలతో బయటపడేవాడని అంటున్నారు. భారత చట్టాల ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం. అలాగే 18 ఏళ్ల లోపు వారిని ప్రమాదకర పరిశ్రమల్లో నియమించడం నిషేధం. అయిన ప్పటికీ ఈ బాలుడు కంపెనీలో పని చేస్తున్న ప్పటికీ, భద్రతా సిబ్బంది నుండి మేనేజ్మెంట్ వరకు ఎవరూ పట్టించుకోలేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్మిక శాఖ అధికారులు నియమిత తనిఖీలు ఎందుకు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మిక సంఘం నాయకుడు రాజు నాయక్ మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు షాద్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో తరచుగా జరుగుతున్నాయని, కంపెనీలు ప్రభావంతో కేసులను దాచిపెడుతున్నాయని ఆరోపించారు. ఓం శివశక్తి కంపెనీని వెంటనే సీజ్ చేసి, బాధ్యులపై 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో మరో కోణం కూడా వెలుగులోకి వచ్చింది. మృతి చెందిన సౌరబ్‌కు సంబంధించిన రెండు ఆధార్ కార్డులు బయటపడటం చర్చనీయాంశమైంది. ఒక కార్డులో పుట్టిన తేదీ 2011గా ఉండగా, మరొకదాంట్లో 2007గా మార్చినట్లు గుర్తించారు. అయితే రెండు కార్డులలోనూ ఆధార్ నంబర్ ఒకటే ఉండటం అనుమానాలకు తావిస్తోంది. బాలుడి అసలు వయస్సు దాచిపెట్టి చట్టాన్ని మోసం చేసి పనిలో పెట్టుకున్నారా అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిరుపేద కుటుంబాల పిల్లలను ఇలాంటి ప్రమాదకర పనుల్లో పెట్టడం పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

- పాఠాలు బోధించిన చిన్నారులు



**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

చిన్నచింతకుంట మండలంలోని సాందీప పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే బల్పం పట్టిన చేతులతో బెత్తం పట్టి ఉపాధ్యా యులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా దీన, ఎంఈవోగా అదీబ్, హెడ్‌మాస్టర్‌గా నిఖిల్, పీఈటీగా ప్రణీత్ వ్యవహరించగా, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న బాధ్యతలు, సవాళ్లు విద్యార్థులకు ప్రత్యక్షంగా అర్థమవుతాయని తెలిపారు. స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థులకు తీపి జ్ఞాపకాలను మిగిల్చే కార్యక్రమమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తదనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు సుధాకర్, నవీన్, రేవతి, రాగిణి, కవిత, మేఘన, శ్రీలత, ఫాతిమా, మహేజా, మసూద, సమ్రీన్, సునీత, గౌరీ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

- నష్టపోయిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి రాణంపల్లి క్యాంపు గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన ఆకాల వర్షానికి వరి పంట తీవ్రంగా నష్టపోవడంతో ఓ రైతు బోరున విలపించాడు. బుధవారం నష్టపోయిన పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించి, రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పంటలు నష్టపోవడం జరిగిందన్నారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, నాయకులు దౌర్ సాయిలు, కొత్తపల్లి రవికిరణ్, శేఖర్, బొట్టే గజేందర్, సతీష్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- ప్రమాదాలు సంభవిస్తున్న పట్టించుకోని అధికారులు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రోడ్డు పై ప్రమాదాలు సంభవిస్తున్న రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రుద్రూర్ - వర్ని రోడ్డు విస్తీర్ణ పనులలో భాగంగా మండలంలోని అక్బర్ నగర్ రహదారి ప్రక్కన ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మంగళవారం రాత్రి రుద్రూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రుద్రూర్ నుండి వర్ని వైపుకు ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా, అక్బర్ నగర్ గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రక్కన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మొరం, కంకర కుప్పలు అడ్డుగా వేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రాణాలు పోతున్నా రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు స్పందించడం లేదన్నారు.

# రేషన్ దుకాణాల్లో అకస్మిక తనిఖీలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలను బుధవారం తూనికల కొలతల ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపుల్లోని తూనికలను పరిశీలించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించే సమయంలో తూనికలలో లోపాలు లేకుండా చూసుకోవాలని రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఈ తనిఖీలలో తూనికల కొలతల సిబ్బంది, రేషన్ డీలర్లు ఉన్నారు.

# మైనారిటీలకు రంజాన్ తోఫాల పంపిణీ...



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అందించిన రంజాన్ తోఫాలను మండల అధికారులు నాయకులు ముస్లింలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ కే.గంగాధర్, ఎఎంసి చైర్మన్ హన్మంత్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పండుగ పురస్కరిం చుకొని ప్రభుత్వం నుండి పేద కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందచేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ బర్ల మధుకర్, పార్టీ అధ్యక్షులు షాహిద్, ఎఎంసి వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, మాజీ ఎంపీటీసీ మనోహర్, పంచాయతీ కార్యదర్శి ముజఫర్ బేగ్, నాయకులు గంగాధర్ దేశాయ్, సలిమ్, అఫ్జల్, జుబేర్, జమిర్, బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి రుద్రూర్ మండల కేంద్రంలోని అంబం గ్రామ శివారులో వరి పంటలు నేలకోరిగాయి. నష్టపోయిన వరి పంటలను బుధవారం ఏఓ సాయికృష్ణ, ఏఈఓ వెంకటేష్ లతో పాటు స్థానిక మండల నాయకులు పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. పంటలను పరిశీలించిన వారిలో నాయకులు మాజీ విండో చైర్మన్ పత్తి రాము, మాజీ జెడ్పీటీసి నారోజి గంగారం, గుర్ల గోపి, కటికే రామ్ రాజ్, యముల గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 19, 2026

# దహన సంస్కారాలకు కౌన్సిలర్ ఆర్థిక సాయం

వేద న్యూస్, జమ్మికుంట: బుధవారం ఉదయం తెల్లవారు జామున హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇస్త్రీ షాప్ కిషన్ తల్లి నాంపల్లి కనుకమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న 6వ వార్డ్ కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ వారి ఇంటికి వెళ్లి కనకమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబీకులను పరామర్శించి దహనసంస్కారాలకు ఖర్చుల కోసం రూ.5,000 అందజేశారు. కౌన్సిలర్ సదుద్దేశంతో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.



# భక్తులతో కిక్కిరిసిన కురుమూర్తి కొండలు

వేద న్యూస్, చిన్నచింతకుంట: ఉగాది అమావాస్యను పురస్కరించుకొని బుధవారం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి కొండలు భక్తులతో కిక్కిరిశాయి. ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు తండోపతండలుగా తరలివచ్చి సప్తగిరుల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిరూపమైన శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి, తడి గుడ్డలతో గోవింద నామస్మరణ చేస్తూ క్యూ లైన్లలో నిలిచి స్వామి దర్శనం పొందారు. వడ్డికాసుల వాడు.. ఆపదమొక్కుల వాడు.. వంటి నామాలతో స్వామిని స్మరిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్నేహ కంపెనీ ఇన్‌చార్జి ప్రశాంత్ రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ అర్చకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వామి విశిష్టతపై అర్చకులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు వివిధ ఆలయాలను దర్శించుకుని అనంతరం కాంచన గుహలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువ భాగంలో ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో మదినేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు.

# ముందుగానే మూడు నెలల బియ్యం

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు శుభవార్త చెప్పింది. ఏప్రిల్ మే జూన్ సంబంధించిన రేషన్ ఒకేసారి ఏప్రిల్ మాసంలో ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు మూడు నెలల బియ్యం అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కాగా మూడు నెలల బియ్యం ఒకేసారి రేషన్ షాపులకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరింది. ఈనెల ఆఖరిలోపు రేషన్ షాపులకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి వేగవంతంగా తరలించాలని పేర్కొంది. అయితే నల్లగొండ జిల్లాలో 1001 రేషన్ షాపులకు గాను 5 లక్షల 39వేల 764 రేషన్ కార్డుదారులకు మోక్షం కలగనుంది.ఎండ తీవ్రతకు రేషన్ షాపులలో ఒకేసారి మూడు నెలల ఇవ్వడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని సంబంధించిన అధికారులు లెక్కలు తీస్తున్నారు. రేషన్ షాపులలో స్థలం కొరత ఉండడంతో రెండు దఫాలుగా రేషన్ షాపులకు బియ్యాన్ని తరలిస్తారని అధికార వర్గాలు పేర్కొంటున్నారు.



# రావోజి తండా గ్రామ పంచాయతీలో ఎంపీఓ తనిఖీ

వేద న్యూస్,సింగరేణి: మండల పరిధిలోని రావోజి తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం మండల పంచాయతీ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ నిర్వహణ, అభివృద్ధి పనుల ప్రగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.రికార్డుల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు తనిఖీలో భాగంగా పంచాయతీకి సంబంధించిన రిజిస్టర్లను, నగదు పుస్తకాలను ఎంపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పారదర్శకత పాటించాలి.

పన్నుల జమ: వసూలు చేసిన ఇంటి పన్నులు, ఇతర పన్నులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. 99 రోజుల ప్రణాళిక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళిక రికార్డులను పక్కాగా నిర్వహించాలని, పనులకు సంబంధించి 'ఆఫ్టర్ – బిఫోర్' (పనికి ముందు, పని తర్వాత) ఫోటోలతో కూడిన నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు సంబంధించిన ఇన్సూరెన్స్ రెన్యూవల్ ప్రక్రియ పూర్తి కావడంతో, దానికి సంబంధించిన భీమా పత్రాలను స్వయంగా ట్రాక్టర్ డ్రైవర్‌కు అందజేశారు. వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలను డ్రైవర్ తన వద్దే ఉంచుకోవాలని, వాహన నిర్వహణలో తగిన జాగ్రత్తలు వహించాలని ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు.



**– అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి**

గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులను కోరారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. బాలు, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో ), పంచాయతీ కార్యదర్శి, ఎంపీడబ్ల్యు (ఎంపీ డబ్ల్యు) సిబ్బంది మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజనులకు సమాచార హక్కుపై అవగాహన కల్పించాలి

వేద న్యూస్, కారేపల్లి : సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ద్వారా గిరిజన ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని, ఈ చట్టంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని పి.ఎస్.ఆర్ యూత్ ప్రెసిడెంట్ జర్పల ధోనీ నాయక్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శ్రీనివాసరావును ధోనీ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి, వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధోనీ నాయక్ వెంట పోలంపల్లి తండా సీనియర్ నాయకులు ధరావత్ లాలు, ధరావత్ రమేష్, లకావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

వేద న్యూస్, గంగాధర: రంజాన్ సందర్భంగా గంగాధర మండలం మధురానగర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చొప్పదండి నియోజక వర్గంలోని ఆరు మండలాలకు చెందిన ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం కలిసి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక గుర్తింపు ఇస్తోందని తెలిపారు. ముస్లింలు సంతోషంగా రంజాన్ జరుపుకునేలా ప్రభుత్వం రంజాన్ తోఫాను అందిస్తున్నదని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మసీదు వంటశాలకు సామాగ్రి అందించిన మాజీ సర్పంచ్

వేద న్యూస్, శంకరపట్నం: కేశవపట్నం మండలం కరీంపేట గ్రామంలో స్థానిక మాజీ సర్పంచ్ వనపర్తి మల్లయ్య తన తల్లిదండ్రులు వనపర్తి మల్లమ్మ, రాజయ్యల జ్ఞాపకార్థంగా గ్రామ మసీదు వంటశాలకు అవసరమైన వంట సామాగ్రి, పాత్రలను అందించారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు, సామూహిక వంటల కోసం ఈ సామాగ్రి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. రంజాన్ మరియు ఇతర పండుగల సమయంలో మసీదుల వద్ద ఇలాంటి వంట ఏర్పాట్లు చేయడం ముస్లిం సోదరుల ఐక్యతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలతరమేష్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బసవయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ చింతం కుమారస్వామి, ప్రజా ప్రతినిధులు అశోక్, అనిల్, హరీశ్, ప్రసాద్, దామోదర్, దాశి, రాజయ్య, మల్లేశం, తిరుపతి, భూమయ్య, స్వామి శంకరయ్య, భిక్షపతి తదితరులతో పాటు గ్రామ ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.




# యువత కోసం 'యువ మండల్ వికాస్ అభియాన్'

## – గ్రామీణ యువతను అభివృద్ధి పథంలో నడిపే లక్ష్యం

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల: గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా మై భారత్ రాజన్న సిరిసిల్ల, శ్రీకృష్ణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల్లో 50 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో యువజన నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా డీవైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని 'మై భారత్' ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కార్యకలాపాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో భవిష్యత్తులో నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుకుగా పాల్గొనే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ అక్కేం నాగరాజు, అనంతారం గ్రామ సర్పంచ్ ఒల్లల రజిత వెంకటేష్, ఉపసర్పంచ్ కదం జయంత్, వార్డు సభ్యులు అక్కేం ఉపేందర్, మల్యాల రాజశేఖర్, బట్టి క్రాంతి, శిలాపురం రమేష్, యువజన సంఘం సభ్యులు బొల్లం శ్రీకాంత్, బండారి వెంకటేష్, గోనెపెల్లి వెంకటేష్, ఒల్లల కృష్ణకుమార్, కదం రాజు, ధరవేణి నాగరాజు, ఒల్లల మధు, చల్ల అంజి, అక్కేం హరికృష్ణ, చొప్పరి అభిరామ్, ఒల్లల శ్రీనివాస్, మల్యాల పర్శరాములు, అరవింద్, వినయ్, స్వామి కిరణ్, అభిషేక్, సురేష్, రాజు, సమీర్, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబానికి బీజేపీ నాయకుల ఆర్థిక సహాయం

వేద న్యూస్, బోయినిపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి బీజేపీ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన దుంపటి సత్తమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, మల్కాపూర్ గ్రామ శాఖ నాయకులు కలిసి ఆమె కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మిరిశెట్టి గంగయ్య, పబ్బల వినోద్, బొంగోని ప్రదీప్, బొంగోని వినయ్, అమీర్శెట్టి అంజయ్య, ప్రసాద్, పబ్బల మహేష్, మునిందర్, మల్లేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**– రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "ఈద్ కా తోఫా" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పేద ముస్లింలకు దుస్తులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం పరస్పర ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండుగల సందర్భంగా అవసరమైన సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ముఖ్యమంత్రి మైనారిటీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడిన మంత్రి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు 3500 "ఈద్ కా తోఫా"లను అందజేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈద్ కా తోఫా ల అందజేత వల్ల నిరుపేద ముస్లిం లు పండగను సంతోషంగా ఆనందంగా జరుపుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, రంజాన్ మనుషుల్లో మనస్ఫూర్తి, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన పర్వదినమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం అవసరమని, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పండుగలు మనలను ఒకటిగా కలిపే వేదికలని, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ




కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్ బస్వరాజు కుమార స్వామి ఆర్‌డివో సుమ, డిఎండబ్ల్యూఓ రమేష్, బల్దియా డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**– ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



వేద న్యూస్,కారేపల్లి : తెలుగు ప్రజల ముఖ్యమైన పండుగ ఉగాది సందర్భంగా వైరా స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరాన్ని సరికొత్త ఆశయాలు, లక్ష్యాలతో ప్రారంభించి విజయాలను సాధించాలని తెలిపారు. రాష్ట్రం మరియు దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు.

# కరీంనగర్‌లో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వేగవంతం

వేద న్యూస్, బోయినిపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి, గుండన్నపల్లి గ్రామాల్లో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజల ఉపాధి, జీవన పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. ఎంపిక చేసిన కుటుంబాలపై మూడు నెలలపాటు ప్రతి నెల సవివరంగా సమాచారం నమోదు చేయనున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, విద్యార్హతలు, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి, కూలీల పనిదినాలు, వేతనాలు వంటి అంశాలను సేకరిస్తున్నారు. మహిళల ఆదాయ వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. ఈ సర్వే ద్వారా ఉపాధి పరిస్థితులపై ఖచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాల పెంపుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టీకాల కార్యక్రమంపై డీఎంహెచ్వో తనిఖీలు

**– సమయానికి వ్యాక్సిన్స్ అందించాలని ఆదేశం**




వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావాలనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ఉపకేంద్రాలు, గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాద్ మండలం పోతుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి టీకాల కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. తనిఖీలలో భాగంగా వ్యాక్సిన్ నిల్వలు, వ్యాక్సిన్ క్యారియర్లలో శీతలీకరణ వ్యవస్థను పరిశీలించారు. టీకాలు ఇవ్వగానే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉపకేంద్ర పరిధిలోని 0–5 సంవత్సరాల పిల్లలకు నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం తప్పకుండా టీకాలు అందించాలని, కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని ఆమె సూచించారు.

## వేసవిలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

**– సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి – ఆత్మకూర్ ఎస్సై జయన్న**

**వేద న్యూస్, ఆత్మకూర్:**



ఆత్మకూరు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలు, దొంగతనాలపై ఎస్సై జయన్న అవగాహన కల్పించారు. బస్సుల్లో ఎక్కే, దిగే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రయాణికులు తమ విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. తొందరపడి ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని, అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి కాలంలో ఇంటి బయట నిద్రించే సమయంలో దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని, ఇళ్లకు తాళాలు వేసి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. మండలంలో పోలీసులు పగలు–రాత్రి తేడా లేకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం భద్రతకు ఎంతో ఉపయోగకరమని, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

**– బుర్ర శ్రీనివాస్ డిమాండ్**

**వేద న్యూస్, హుస్నాబాద్ :**



గత రెండు రోజులుగా భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం తో అన్నదాత కు అపార నష్టం వాటిల్లిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో గల భీమదేవరపల్లి సైదాపూర్ హుస్నాబాద్ అక్కన్న పేట తదితర మండలాల్లో మామిడి మరియు మొక్కజొన్న పంటలకు భారీ నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు..చేతికొచ్చిన పంట నేలరాలిపోవడంతో అన్నదాతలు హరిగోశ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వపరంగా నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఈసారి భారీగా మామిడి కాత వచ్చిందని దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నలకు దుఃఖమే మిగిలిందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## రూ.2 కోట్లు పలికిన హుస్నాబాద్ వారసంత అంగడి

**వేద న్యూస్, హుస్నాబాద్ :**



బుధవారం నాడు హుస్నాబాద్ మున్సిపల్ ఆఫీసులో జరిగిన వారసంత అంగడి వేలం పాటను ప్రారంభించిన కమిషనర్ మల్లికార్జున్ ,గత సంవత్సరం 92 లక్షలు పలికిన వారసంత అంగడి ఇప్పుడు దానికి పది శాతం పెంచి కోటి పద్నాలుగు లక్షలతో పాట ప్రారంభించగా ఐలేని రాజ మహేంద్ర రెడ్డి రెండు కోట్ల వేలం పాట పాడి వారంసంత అంగడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ మరియు మిగిలిన గుత్తే దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు కోట్ల రూపాయలకు వారంసంత అంగడి వేలం పాట పాడటం వల్ల హుస్నాబాద్ మునిసిపాలిటీ కి మంచి ఆదాయం చేకురిందని ఆనందం వ్యక్తం చేసారు. వారసంత అంగడి దక్కించుకున్న రాజ మహేంద్ర రెడ్డికి అభినందనలు తెలిపారు.

# మత సామరస్యానికి నిదర్శనం ఇఫ్తార్ విందు

**– రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు అని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని వరంగల్ ఎల్బీనగర్ లోని ఏ వన్ క్లాసిక్ కన్వెన్షన్ హాల్ లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాల్గొన్నారు. ఉపవాస దీక్షలతో ఉన్న ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు అన్ని మతాలు చెప్పేది ఒకటేనని మనుషులంతా సోదరా భావంతో ఉండాలని చెప్పారు. ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ముస్లిం సోదరులను అన్ని రంగాల్లో రాణించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని, ముఖ్యంగా పలు రంగంలో ప్రతిభ చాటిన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.





ముస్లిం మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని, ప్రభుత్వం కలిపిస్తున్న అవకాశాలను అన్ని వర్గాల ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముస్లింలకు రంజాన్ పండుగ ఎంతో పవిత్రమైనదని, నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేయడం చెప్పుకోదగ్గ విషయమని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆర్డీవో సుమ, ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు,కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

**– బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల అభివృద్ధికి కనీసం లక్ష కోట్లు కేటాయించాలని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, వారికి రావాల్సిన హక్కు వాటాను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని స్పష్టం చేశారు. బీసీలకు అన్యాయం కొనసాగితే తీవ్ర స్థాయిలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, అరెవెల్లి వినయ్ కుమార్, నవీన్, విష్ణు, షాద్, శేఖర్, జుమీర్, రమేష్, అజిత్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్లో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు



వేద న్యూస్, హుస్నాబాద్ :
హుస్నాబాద్ పట్టణ బస్టాండ్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ సీఐ కోంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు తమ ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ వెంకట్ రెడ్డితో పాటు పోలీసులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 19, 2026

# 300మంది భక్తులతో గోటి తలంబ్రాల దీక్ష

**– రుద్రూర్ విఠళేశ్వర మందిరంలో తలంబ్రాల తయారీ**

**వేద న్యూస్, రుద్రూర్ :**



భద్రాచల సీతారాముల కళ్యానానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం కోటి తలంబ్రాల దీక్ష నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామంలోని విఠళేశ్వర మందిరం ఆధ్వర్యంలో బుధవారం నాడు ఘనంగా జరిగింది. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటి తలంబ్రాకు పూజలు జరిపి 300మంది భక్తులచే 3గంటల పాటు రామనామ స్మరణ చేయిస్తూ గోటితో వడ్లను ఓలిచి తలంబ్రాలుగా మార్చారు. భక్తులు అక్కడే రామకోటి రామరాజుకు అందజేశారు. 4సారి కళ్యానానికి 3క్వింటాల గోటి తలంబ్రాలు తెలంగాణ రాష్ట్రం నుండి అందిస్తూన్నామని రామకోటి రామరాజు తెలిపారు. మేము భద్రాచలం వెళ్లలేక పోయిన కూడా, మేము ఓలిచే తలంబ్రాలు మొదటి సారిగా భద్రాచల కళ్యానానికి వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలం భక్తులు ఆనందాన్ని వెళ్లుబుచ్చారు. ఇంతటి అదృష్టాని అందించిన రామకోటి రామరాజును కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# నేలకోరిగిన మొక్కజొన్న, వరి పంటలు

**వేద న్యూస్, పోతంగల్ :**



పోతంగల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన బారి వర్షానికి మొక్కజొన్న, వరిపంటలు నేలకోరిగాయి. మండలంలోని టాక్లి, దోమలేడ్గి గ్రామాలతో పాటు మరికొన్ని చోట్ల మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మరికొన్ని గ్రామాల్లో అక్కడక్కడ చేతికొచ్చిన పంట నేల పాలవడంతో రైతులు ఆవేదన చవ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు

# తండ్రి మృతి.. కన్నీటి మధ్య పరీక్షకు..

**– ఎల్లారెడ్డిపేటలో హృదయ విదారక ఘటన**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



ఒకవైపు తండ్రి మృతి, మరోవైపు భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పరీక్ష.. ఈ రెండింటి మధ్య ఒక విద్యార్థి ఎదుర్కొన్న పరిస్థితి స్థానికులను కంటతడి పెట్టించింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబం దుఃఖంలో మునిగిపోయిన వేళ, ఆయన చిన్న కుమారుడు అక్షిత్ రెడ్డికి అదే రోజు పదో తరగతి హిందీ పరీక్ష ఉండటం విషాదాన్ని మరింత పెంచింది. ఇంట్లో తండ్రి మృతదేహం, బంధువుల రోదనలు మధ్య ఉన్నప్పటికీ, తన భవిష్యత్తు కోసం అక్షిత్ పరీక్షకు హాజరయ్యాడు. అతను చదువుతున్న విద్యాసంస్థ వ్యవస్థాపకులు లతీఫ్ కుటుంబ సభ్యులను ఓదార్చి, అక్షిత్‌ను పరీక్షకు పంపించారు. పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయంలో సోదరితో మాట్లాడుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్న అక్షిత్ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. పుట్టెడు దుఃఖాన్ని హృదయంలో దాచుకుని పరీక్షకు హాజరైన ఈ విద్యార్థి ధైర్యం అందరినీ కదిలించింది. ఈ ఘటన జీవితం ముందుంచే కఠిన పరిస్థితుల్లో కూడా మనిషి ఎలా నిలబడాల్సి వస్తుందో గుర్తు చేసింది.

# సీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**– రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశం**

**వేద న్యూస్, గంభీరావుపేట:**



రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై వైద్యులను ప్రశ్నించారు. తనిఖీలలో భాగంగా ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల పంపిణీ గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ విభాగం, ఎక్స్‌రే గది, యునాని విభాగం తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, శుభ్రతను కచ్చితంగా పాటించాలని ఎంపీడీవోకు సూచించారు. అవసరమైన మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు సమయానుకూలంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, డీసీహెచ్ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

**– వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



యాసంగి రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఫిబ్రవరి 28 నాటికి కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొందిన రైతులు ఈ యాసంగి రైతు భరోసాకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదార్ పాస్‌బుక్ లేదా డిజిటల్ సంతకం కలిగిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్స్ ఖాతా వివరాలు, పూర్తి వివరాలతో నింపిన దరఖాస్తు పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పత్రాలను స్థానిక రైతు వేదికలో ఉన్న మండల విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా తెలిపారు.

# ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు

**వేద న్యూస్, రుద్రూర్ :**




ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులచే ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఈ శిబిరాన్ని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సమత సందర్శించి శిబిర నిర్వహణ, ప్రజలు ప్రత్యేక వైద్యులచే పొందే సేవలను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ శిబిరంలో 275 మంది వైద్య పరీక్షలు నిర్వహించగా రిఫర్రల్స్ 76, ల్యాబ్ టెస్టిస్ 96 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అయోషా సిద్దిక, గ్రామ ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ రవి, సుమతి, జ్యోతి, ఫార్మసీ స్వప్న, స్టాఫ్ నర్సు వరలక్ష్మి, శ్రావణి, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ఆరోగ్య కేంద్రం కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల వద్దకే ఆన్సైట్ ఎఫ్ఐఆర్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- **సంఘటనా స్థలంలోనే కేసుల నమోదు ప్రక్రియ**
- **జిల్లాలో ఇప్పటికే 12 కేసులు నమోదు**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్**


ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తోంది అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నేరం జరిగిన తర్వాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ విధానం అమలులో ఉందని, ఇప్పటికే ఈ విధానం ద్వారా 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల వద్ద నుంచే ఫిర్యాదును స్వీకరిస్తారు. డయల్ 100కు కాల్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. రోడ్డు ప్రమాదాలు, గొడవలు వంటి ఘటనల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందించి ఆసుపత్రికి తరలిస్తారు. ఈ ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానం ద్వారా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల వివాదాలు, వేధింపులు, అనుమానాస్పద మృతులు వంటి కేసులను సంఘటనా స్థలంలోనే నమోదు చేసే అవకాశం కలుగుతుంది. ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందడంతో పాటు పోలీస్ సేవలపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

**– వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యం**

**– డీఎల్‌బీసీ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణాల మంజూరులో ముందుండాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (డీఎల్‌బీసీ) చైర్‌పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన డీఎల్‌బీసీ సమావేశంలో వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాల అమలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి పథకాల పురోగతిపై బ్యాంకుల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణానికి సంబంధిత రుణాల మంజూరులో వేగం పెంచాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన రుణాలను సకాలంలో అందించాలని పేర్కొన్నారు. బ్యాంకుల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు అందించాలని, కేవైసీ అప్డేట్ చేయాలని సూచించారు. ఆర్‌సెటీ ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీసి, ఉపాధికి దోహదపడే కోర్సులను ప్రోత్సహించాలని తెలిపారు. స్వయం ఉపాధి అవకాశాల కోసం రుణాలను సమర్థంగా వినియోగించుకునేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ఎం రాజనరేంద్ర, డీఆర్‌డీఓ గీత, డీవీహెచ్‌వో రవీందర్ రెడ్డి, డీపీఓ అఫ్జల్ బేగం, బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 19, 2026

## 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈవెంట్‌పై కేసు..




**వేద న్యూస్ డెస్క్:**

హైదరాబాద్ యూసుఫ్‌గూడలో జరిగిన ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్ వివాదంలో చిక్కుకుంది. నిబంధనలు ఉల్లంఘించి భారీగా జన సమీకరణ చేశారనే ఆరోపణలతో ఈవెంట్ ఆర్గనైజర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేవలం 1,500 మందికి మాత్రమే ముందస్తు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. అయితే, వాస్తవానికి 5,000 మందికి పైగా అభిమానులు హాజరుకావడంతో పరిస్థితి అదుపుతప్పింది. సామర్థ్యానికి మించి జనసందోహం రావడంతో అక్కడ తొక్కిసలాట వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ భారీ జనసమీకరణ కారణంగా యూసుఫ్ గూడ, జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను పోలీసులు సెక్షన్ 188 కింద ఈవెంట్ ఆర్గనైజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనుమతికి మించి పాస్‌లు జారీ చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉగాది కానుకగా ఓటీటీలోకి 'సీతా పయనం'..

**వేద న్యూస్ డెస్క్:**



ఉగాది పండుగ సందర్భంగా ప్రేక్షకులకు ప్రత్యేక కానుకగా మరో కొత్త సినిమా ఓటీటీలోకి రాబోతోంది. యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా తన కూతురు ఐశ్వర్య అర్జున్ను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ తెరకెక్కించిన సీతా పయనం ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. థియేటర్లలో మోస్తరు స్పందన పొందిన ఈ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్, ఇప్పుడు ఓటీటీ ద్వారా మరింత మంది ప్రేక్షకులను చేరుకోవడానికి సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ సినిమా, కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడింది. కథలో ప్రేమ, కుటుంబ బంధాలు, భావోద్వేగాలు మేళవించి ప్రేక్షకులకు హృద్యమైన అనుభూతిని అందించేలా తీర్చిదిద్దారు. హీరోగా నిరంజన్ నటించగా, ప్రముఖ నటులు ప్రకాశ్ రాజ్, సత్యరాజ్, కోవై సరళ, సిరి హనుమంత్, సరన్ శక్తి తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. అలాగే అర్జున్ సర్జా, ధ్రువ్ సర్జా ప్రత్యేక అతిథి పాత్రల్లో కనిపించడం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సన్ నెక్ట్స్ సొంతం చేసుకుంది. ఉగాది సందర్భంగా మార్చి 19 నుంచి ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా అందుబాటులో ఉండనుంది. 'సీతా పయనం' చిత్రాన్ని అర్జున్ సర్జా స్వయంగా నిర్మించడం విశేషం. తన కూతురిని హీరోయిన్‌గా నిలబెట్టే ప్రయత్నంలో భాగంగా ఈ సినిమాను ఎంతో శ్రద్ధగా రూపొందించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. కథకు తగ్గట్టుగా సహజమైన భావోద్వేగాలు, కుటుంబ విలువలు, ప్రేమ కథను సమతుల్యంగా చూపించడానికి ప్రయత్నించారు. ఈ చిత్రానికి సంగీతాన్ని అనూప్ రూబెన్స్ అందించగా, ఆయన స్వరపరిచిన పాటలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా మెలోడీ పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. థియేటర్లలో విడుదల సమయంలో ఈ పాటలకు మంచి స్పందన లభించింది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన వారికి ఇప్పుడు మంచి అవకాశం లభించింది. ఉగాది పండుగ రోజు కుటుంబంతో కలిసి చూసేందుకు సరైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'సీతా పయనం' నిలుస్తుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కొత్త హీరోయిన్‌గా ఐశ్వర్య అర్జున్ నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌పై కూడా ఆసక్తి నెలకొంది. మొత్తానికి, థియేటర్లలో మోస్తరు విజయం సాధించిన ఈ చిత్రం, ఓటీటీలో మరింత ఆదరణ పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉగాది సందర్భంగా కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా 'సీతా పయనం' ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.

# హీరోయిన్ల ప్రాధాన్య చిత్రాలకు హీరోలు వెనకడుగు

**వేద న్యూస్ డెస్క్:**



బాలీవుడ్‌లో తనదైన శైలితో, బలమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా సినీ పరిశ్రమలో ఉన్న పురుషాధిక్యత, హీరోల ఆలోచనా విధానంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ, కథానాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించేందుకు చాలా మంది హీరోలు ఆసక్తి చూపడం లేదని వెల్లడించారు. ముఖ్యంగా తాను ద్విపాత్రాభినయం చేస్తున్న ఒక సినిమా సందర్భంలో ఎదురైన అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. ఆ చిత్రానికి ముందు ఒక ప్రముఖ స్టార్ హీరోను సంప్రదించారని, కానీ కథలో హీరోయిన్ పాత్రకు అధిక ప్రాధాన్యం ఉందని తెలుసుకున్న తర్వాత ఆయన ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించాడని తాప్సీ తెలిపారు. తనతో ఇప్పటికే పని చేసిన హీరోనే అయినప్పటికీ, పాత్ర నిడివి మరియు ప్రాధాన్యం కారణంగా వెనక్కి తగ్గడం తనకు ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. ఇంకా, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటించేందుకు పెద్దగా ముందుకు రావడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేక్షకుల ప్రశంసలు హీరోయిన్‌కే ఎక్కువగా దక్కుతాయనే భావనతో, ఇలాంటి సినిమాల నుంచి దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, కథా ప్రధాన చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు పరిశ్రమలో సమానత్వంపై మళ్లీ చర్చను రగిలిస్తున్నాయి. మహిళా పాత్రలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయానికి కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

# రాజకీయాల్లో నటీమణులను లాగొద్దు..

## మంచు విష్ణు ఘాటు స్పందన

**వేద న్యూస్ డెస్క్:**



తమిళనాడు రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా స్టార్ హీరో విజయ్ సొంత రాజకీయ పార్టీ ప్రారంభించిన తర్వాత ఆయన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఆరోపణలు వివాదాలకు దారితీస్తున్నాయి. విజయ్ వ్యక్తిగత జీవితంపై, ఆయన భార్యతో విడాకుల వ్యవహారం, అలాగే ప్రముఖ నటి త్రిషతో సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం మరింత కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే సీనియర్ నటి ఖుష్బూ సుందర్ స్పందిస్తూ త్రిషకు మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వివాదంపై నటుడు మంచు విష్ణు కూడా ఘాటుగా స్పందించారు. రాజకీయ కథనాల్లోకి నటీమణులను లాగడం అత్యంత అసభ్యకరమని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం సినీ తారల వ్యక్తిగత జీవితాలను ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. నటీనటులు కేవలం తెరపై కనిపించే పాత్రలే కాకుండా, వారికి కూడా భావోద్వేగాలు, గౌరవం ఉంటాయని విష్ణు పేర్కొన్నారు. వారి జీవితాల్లో ఒక ప్రైవేట్ స్పేస్ ఉంటుందని, దానిని గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు. నటీనటులకు కుటుంబాలు, సామాజిక స్థానం ఉంటాయని గుర్తు చేస్తూ, వారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం నాగరికతకు విరుద్ధమని విమర్శించారు. ముఖ్యంగా మహిళల విషయంలో మరింత సంయమనం పాటించాలని ఆయన సూచించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, అవి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉండకూడదని హితవు పలికారు. వార్తల కోసం నటీమణులను బలిపశువులుగా మార్చడం తగదని అన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం ఉందని గుర్తుచేసిన మంచు విష్ణు, అలాంటి దేశంలో రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను అవమానాలకు గురిచేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. "మనం మరింత మెరుగ్గా ప్రవర్తిద్దాం" అంటూ సమాజానికి, రాజకీయ వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు.

# అందంతో ఆకట్టుకుంటున్న 'లిటిల్ హార్ట్స్' బ్యూటీ..



**వేద న్యూస్ డెస్క్:**

షార్ట్ ఫిల్మ్స్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టి, ఒక్క సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించిన నటి శివాని నాగారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'లిటిల్ హార్ట్స్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ ముద్దుగుమ్మ, తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల విడుదలైన ఆమె లేటెస్ట్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సింపుల్ లుక్స్‌లోనే ఆకట్టుకునే ఈ బ్యూటీ, స్టైలిష్ అవుట్‌ఫిట్స్‌తో ఫ్యాన్స్‌ను కట్టిపడేస్తోంది. గ్లామర్‌తో పాటు సహజమైన అందంతో కూడా ఆమె ప్రత్యేకంగా కనిపిస్తోంది. 'లిటిల్ హార్ట్స్' తర్వాత హే బలవంత్ సినిమాలో నటించిన శివాని, నటిగా తన కెరీర్‌ను స్థిరంగా ముందుకు తీసుకెళ్తోంది. గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 2024లో మంచి అరంగేట్రం చేసానని, 2025 నాటికి మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నానని, 2026లో పూర్తి కమర్షియల్ హీరోయిన్‌గా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. సినిమాల ఎంపికలో "క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ" అనే సిద్ధాంతాన్ని పాటిస్తానని ఆమె స్పష్టం చేసింది. ఎక్కువ సినిమాలు చేయడం కంటే, మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటించడం ముఖ్యం అని ఆమె అభిప్రాయపడింది. ఇక తన సహనటుడు సుహాస్ గురించి కూడా శివాని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'అంబాజిపేట మ్యారేజ్ బ్యాండ్' సమయంలో సుహాస్ తనకు ఎంతో సహాయం చేశాడని, ఇండస్ట్రీలో చాలా సపోర్టివ్ వ్యక్తిగా ఆయనను భావిస్తున్నానని చెప్పింది. మరోసారి ఆయనతో కలిసి పని చేయడం తనకు చాలా ప్రత్యేకమని వెల్లడించింది. మొత్తానికి, నటిగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా తనదైన స్టైల్‌తో ఆకట్టుకుంటున్న శివాని నాగారం, ఇప్పుడు యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది. ప్రస్తుతం ఆమె లేటెస్ట్ పిక్స్, కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

# ఓటీటీలో దడపుట్టించే హారర్ థ్రిల్లర్..


## 'ఫోర్త్ ఫ్లోర్' స్ట్రీమింగ్ రెడీ

**వేద న్యూస్ డెస్క్:**




హారర్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు మరో ఆసక్తికరమైన చిత్రం ఓటీటీలోకి రాబోతోంది. తమిళంలో ఇటీవల విడుదలైన ఫోర్త్ ఫ్లోర్ ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. సైకాలజికల్ మిస్టరీ హారర్ జోనర్‌లో రూపొందిన ఈ సినిమా థియేటర్లలో విడుదలై నెల కూడా తిరగకుండానే ఓటీటీలోకి రావడం విశేషం ఈ చిత్రాన్ని దర్శకుడు సుందరపాండి తెరకెక్కించగా, రాజా నిర్మించారు. ప్రధాన పాత్రల్లో ఆరి అర్జునన్, దీప్సిక, పవిత్ర నటించారు. ఫిబ్రవరి 27న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల్లో మిస్టరీ ఎలిమెంట్స్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సన్ నెక్ట్స్ సొంతం చేసుకుంది. మార్చి 20 నుంచి ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అంటే మరికొన్ని రోజుల్లోనే ఈ హారర్ థ్రిల్లర్ ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. కథ విషయానికి వస్తే, ధీరన్ అనే యువకుడికి అనూ నుంచి ఒక రోజు కాల్ వస్తుంది. గతంలో తనతో ప్రేమలో ఉన్న ఆమెను కలవడానికి చెన్నైకి వెళ్తాడు. కానీ అనూ చెప్పిన సమయానికి రాకపోవడంతో, అతను ఒక అపార్ట్‌మెంట్‌లోని 'ఫోర్త్ ఫ్లోర్'లో ఉండాల్సి వస్తుంది. అక్కడి నుంచి అతని జీవితంలో విచిత్రమైన సంఘటనలు ప్రారంభమవుతాయి.ఆ ఫ్లోర్‌లో ఎదురయ్యే అప్రకృత అనుభవాలు, భయానక పరిణామాలు అతన్ని గందరగోళానికి గురిచేస్తాయి. ఈ సంఘటనల వెనుక ఉన్న నిజం ఏమిటి? అనూ ఎందుకు అతన్ని అక్కడికి పిలిచింది? అనే ప్రశ్నలకు సమాధానమే సినిమా కథలో ప్రధాన ఆసక్తికర అంశం.

# 'డ్యూన్ పార్ట్ త్రీ' టీజర్ విడుదల




**వేద న్యూస్ డెస్క్ :**

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న డ్యూన్: పార్ట్ త్రీ టీజర్ ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ దర్శకుడు డెనిస్ విల్లెనూవ్ తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం, రచయిత ఫ్రాంక్ హెర్బర్ట్ రచించిన 'డ్యూన్ మెస్సయ్య' నవల ఆధారంగా రూపొందుతోంది. ఈ కథలో ప్రధాన పాత్ర అయిన పాల్ అట్రిడీస్ ప్రయాణం, రెండో భాగం ముగిసిన చోటు నుంచే కొనసాగనుంది. చక్రవర్తిగా బాధ్యతలు చేపట్టిన పాల్ తన అధికారాన్ని ఎలా నిలబెట్టుకుంటాడు? విశ్వవ్యాప్తంగా తలెత్తే యుద్ధాలను ఎలా ఎదుర్కొంటాడు? అనే అంశాలు ఈ చిత్రంలో ప్రధానంగా నిలుస్తాయి. ఈ పాత్రలో తిమోతీ చాలమెట్ మరోసారి మెప్పించనున్నాడు. టీజర్‌లో చూపించిన అరాకిస్ గ్రహం విజువల్స్, యుద్ధ సన్నివేశాలు అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా భారీ స్థాయిలో రూపొందించిన యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. జెండయా, ఫ్లోరెన్స్ పగ్, అన్యా టేలర్-జోయ్ వంటి స్టార్ నటీనటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. అలాగే, ప్రఖ్యాత సంగీత దర్శకుడు హన్స్ జిమ్మెర్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన సంగీతం సినిమాకు మరింత గంభీరతను తీసుకొచ్చింది. మొత్తానికి, విజువల్స్, యాక్షన్, సంగీతం కలిసి ఈ టీజర్‌ను హాలీవుడ్ స్థాయిలో మరో భారీ అనుభూతిగా మార్చాయి. సునామీ సృష్టించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073